క్లుప్తంగా

నేడు అప్పంపల్లిలో రక్తదాన శిబిరం

చిన్నచింతకుంట: ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని అప్పంపల్లిలో స్వయం సేవక్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆ శాఖ సంఘం సభ్యుడు శ్రీగురు భూపాల్ రెడ్డి తెలియజేశారు. కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల యువకులు అధిక సంఖ్యలో హాజరై రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

పశువుల సంత వేలం..

దేవరకద్ర: దేవరకద్ర పశువుల సంత వేలం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద కొనసాగనుందని ఈఓ సీత్యానాయక్ ఒక ప్రకటనలో తెలియజేశారు. పశువుల సంతతో పాటు గొర్రెలు మేకల సంత, తైబజార కూరగాయల సంత వేలం జరుగుతుందన్నారు. ఇప్పటికే వేలంలో పాల్గొనడానికి డీడీలు తీసి ఇచ్చిన వారు వేలానికి హాజరుకావాలని తెలియజేశారు.

మార్కెట్‌లో లావాదేవీలు

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్‌కు వరుస సెలవుల తరువాత తిరిగి లావాదేవీలు ప్రారంభం కానున్నాయి. మూడు రోజులుగా మార్కెట్‌లో లావాదేవీలు జరగలేదు. శుక్రవారం యధావిధిగా ఈనామ్ టెండర్ల ద్వార కొనుగోళ్లు ప్రారంభం అవుతాయని అధికారులు తెలియజేశారు. ఉగాది పండుగ సందర్భంగా బుధవారం ఉల్లిపాయల వేలం జరగలేదు, ఉల్లి వేలం నేడు జరిగే అవకాశం ఉందని వివరించారు.

జాతీయ పంచాయతీల అవార్డుల కార్యక్రమం

నవాబుపేట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జాతీయ పంచాయతీ అవార్డుల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ అనంతయ్య తెలియజేశారు. మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమంలో అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు. కాగా మండలంలో 54 గ్రామాలకు గాను దాదాపుగా 24 గ్రామాలు అవార్డుల రేసులో ఉన్నాయి.

భద్రాచలం తరలిన ఆలయ కమిటీ సభ్యులు



కోయిల్‌కొండ: మండలంలోని అంకిళ్లకి చెందిన శ్రీరామ ఆలయ కమిటీ సభ్యులు గురువారం భద్రాచలానికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడారు. భద్రాచలంలోని పవిత్ర గంగా జలాన్ని అంకిళ్లలో నూతనంగా నిర్మించిన శ్రీరామాలయానికి తీసుకొచ్చి ఆలయాన్ని శుభ్రపర్చడం జరుగుతుందన్నారు. అంతకు ముందు శ్రీరామ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు సంపత్ కుమార్, వెంకట్‌రాములు, సాయిబన్నగౌడ్, నర్సింహులు, రాజశేఖర్, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలేదీక్షలు



కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్‌ను మండలం చేయాలని మండల సాధన సమితి జేఏసీ నాయకులు గురువారం రిలే దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మండల ఏర్పాటు కోసం అభంగపట్నం ఉపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి రూ.2,000 అందించారు. రిలే దీక్షలో జేఏసీ నాయకులు వెంకటేష్, ఆంజనేయులు, రవి, రామచంద్రయ్య, పాండునాయక్, రాజు, వాసీం, చిన్న, ఖాజ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌కి చెందిన వంద మంది బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కురుమ, యాదవ సంఘానికి చెందిన నాయకులు గురువారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నివాసంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అమిస్తాపూర్‌కు చెందిన యాదవ సంఘం అధ్యక్షుడు డోకూర్ శంకర్, దుబాయ్ కృష్ణయ్య, ఎర్ర వెంకటయ్య, బత్తుల గోపాల్, డోకూర్ శేఖర్‌తో పాటు 80 మందికి పైగా బీఆర్‌ఎస్‌లో చేరారు. ముడా డైరెక్టర్ సాయిలు, అజీజ్, సత్యం, శివరాజ్ తదితరులు ఉన్నారు.

వృద్ధుడికి గాయాలు

మిడ్జిల్: మండల కేంద్రంలో గురువారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో బోయిన్‌పల్లికి చెందిన కేశ ఆంజనేయులు అనే వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం 108లో జడ్చర్ల ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలియజేశారు.

వైభవంగా రథోత్సవం

- ఘనంగా వరదరాజులస్వామి బిందె సేవ.. ఎద్దుల బండ్ల ఊరేగింపు
- భక్తి పారవశ్యంతో పులకించిపోయిన భక్తులు



కోడూర్‌లో వరదరాజులస్వామి రథోత్సవాన్ని లాగుతున్న భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: దేశంలోనే ప్రముఖ పుణ్య క్షేత్రాల్లో ఒకటైన కాంచీపురంలో వెలిసిన వరదరాజులస్వామి సుమారు ఐదువేల సంవత్సరాల కిందట చోళుల రాజధాని అయిన ప్రస్తుత కోడూర్‌లో ప్రతిష్ఠితమయ్యారు. ఆనాటి నుంచి ఆనవాయితీగా ఉగాది పర్వదినాన గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా శ్రీ వరదరాజులస్వామి ఉత్సవాలను నిర్వహిస్తూ.. వస్తున్నారు. అందులో భాగంగానే శ్రీశోభకృత్ నామ తెలుగు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గ్రామపెద్దలు వరదరాజులస్వామి దేవాలయంలో బుధవారం ఉత్సవాలను ప్రారంభించి గురువారం రాత్రి వరకు కొనసాగించారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం

కోడూర్‌లో వెలిసిన వరదరాజుల స్వామివారి రథోత్సవం గురువారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవాల్లో భాగంగా ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భగుడి నుంచి సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాల మధ్య ప్రధాన ద్వారం వెంట దేవస్థానం ఆవరణలోని రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. వివిధ రకాల పూలు, విద్యుత్ బల్బులు, మామిడి తోరణాలతో ముస్తాబుచేసిన రథంపై స్వామివారిని ఉంచి రథోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తుల హరిన్నామస్మరణ మధ్య ఈ రథం ముందుకు కదిలింది. భక్తులు స్వామివారి రథాన్ని లాగి భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. అనంతరం బిందెసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉగాది పర్వదిన మరుసటి రోజు గురువారం హోలీ పండుగను ఎలాంటి తరతమ భేదాలు లేకుండా గ్రామస్తులు ఒకరికొకరు రంగులు చల్లుకుని ఆటలు ఆడుకున్నారు. సాయంత్రం స్వామివారి దేవాలయం చుట్టూ ఎద్దుల బండ్ల ఊరేగింపు సైతం అంగరంగ వైభవంగా కనులపండువగా నిర్వహించారు.

కోడూర్‌కు వెయ్యేళ్ల చరిత్ర...

ఒక్కపుడు జిల్లాలోని కందూరు, కోడూర్ గ్రామాలు చోళుల రాజధానులుగా ఉండేవని, ఆ కాలంలో ధనాగారం కూడా కోడూర్‌లోనే ఉండేదని, పురావస్తు శాఖ పరిశోధకుడు ప్లచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ శివనాగిరెడ్డి తేల్చారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. సర్పంచ్ బి.శ్రీకాంత్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ నర్సింహులు, సింగిల్‌విండో డైరెక్టర్ కృష్ణయ్యగౌడ్, మన్యంకొండ దేవస్థాన ఉత్సవ కమిటీ సభ్యుడు చిన్నయ్యగౌడ్ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి ప్రత్యేక పూజలు

శ్రీ వరదరాజులస్వామి బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయంలో భక్తులతో కలిసి భజనలో పాల్గొన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నీలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



ఉత్సవాల్లో హోలీ ఆడుతున్న గ్రామస్తులు

ఘనంగా షాహీద్ దివస్



జేపీఎన్‌సీఈలో రక్తదానం చేస్తున్న సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని జేపీఎన్‌సీఈలో గురువారం 'షాహీద్ దివస్'ను నిర్వహించారు. ఈ సందర్భంగా పాలమూరు బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం కళాశాల చైర్మన్ కేఎస్ రవికుమార్ మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు ప్రాణత్యాగం చేసిన గొప్ప మహనీయులని అన్నారు. కాగా వాసవీ క్లబ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సుమారు 70 మంది రక్తదానం చేశారు. జేపీఎన్‌సీఈ ప్రిన్సిపాల్ డా.ఎ.సుజీవన్‌కుమార్, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు డా.వి.ఇ.చంద్రశేఖర్, ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ సీనియర్ ఉపాధ్యక్షుడు విట్యాల రామేశ్వర్, గుద్దేవి శివప్రసాద్, కలకొండ రాఘవేందర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు నివాళి

జడ్చర్ల టౌన్: స్వాతంత్ర్య సమరంలో అలుపెరగని పోరాటం చేసి పిన్న వయసులోనే ఉరికొయ్యను ముద్దాడిన మహనీయులు సుఖ్‌దేవ్, రాజ్‌సింగ్, భగత్‌సింగ్‌ల వర్ధంతి పురస్కరించుకుని గురువారం క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. స్థానిక డిగ్రీ కళాశాల బొటానికల్ గార్డెన్‌లో వారి స్మారకార్థం మొక్కలు నాటారు. అనంతరం కళాశాలకు హోం థియేటర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.అప్రియాచిన్నమ్మ, అధ్యాపకుడు డా.సదాశివయ్య, క్లాస్‌మేట్ క్లబ్ అధ్యక్షుడు బాదం సంజీవ్‌గుప్త, సభ్యులు పెద్ది వెంకటేశ్, పుల్లయ్య, రఘు, వెంకటేశ్‌గౌడ్, శేఖర్ పాల్గొన్నారు.

రేపు మందకృష్ణ మాదిగ రాక

జడ్చర్ల టౌన్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి సోషలిస్టు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ 25న వస్తున్నారని ఆ పార్టీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ జంగయ్య మాదిగ తెలియజేశారు. గురువారం జడ్చర్లలో విలేకరులతో మాట్లాడారు. అమ్రాబాద్ మండలం మున్ననూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ నెల 6న మృతిచెందిన నిఖిత విద్యార్థినికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. నిర్వహించే బంద్ కార్యక్రమంలో మందకృష్ణ పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మార్పీఎస్, సోషలిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

భూత్పూర్ తైబజార్ వేలంలో రూ.17.22 లక్షల ఆదాయం

భూత్పూర్: స్థానిక మున్సిపాలిటీ చౌరస్తాలో ప్రతి ఆదివారం నిర్వహించే సంత(తైబజార్) గురువారం వేలం చేపట్టగా రూ.17.22 లక్షలకు గ్రామానికి చెందిన చంద్రశేఖర్ వేలం దక్కించుకున్నాడు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన వేలంలో 2023–24 సంవత్సరానికి గాను సంత వేలం నిర్వహించారు. గతేడాది కంటే ఈ సారి రూ.6 లక్షలు అధికంగా మున్సిపాలిటీకి ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో చైర్మన్ బస్వరాజ్ గౌడ్, కమిషనర్ నజీబ్, మేనేజర్ అశోక్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ జమ్ములప్ప

రాజాపూర్: మోసపూరిత ప్రకటనలు నమ్మి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే తమ బ్యాంక్ అకౌంట్ నంబర్లు, పాస్‌వర్డ్‌లు, తమ ఫోన్‌కు ఓటీపీ వచ్చిందని ఇలా జరుగుతున్న సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జడ్చర్ల రూరల్ సీఐ జమ్ములప్ప పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లిలో పోలీసు కళాజాతా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ సమీపంలో పరిశ్రమలు ఉండటంతో ఎవరికి పడితే వారికి ఇళ్లను అద్దెకు ఇవ్వకూడదని గ్రామస్తులకు సూచించారు. ముఖ్యంగా బాల్యవివాహాలు చేయడం నేరమని, బాల్యవివాహాలు చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. అంతేకాకుండా ప్రేమపేరుతో తమ పిల్లలను మోసం చేసి అత్యాచారాలు చేసి చంపివేస్తున్న సంఘటనలు చూస్తూనే ఉన్నామని, ఇలాంటి సంఘటనలు జరుగకుండా తమ పిల్లలపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా ఇళ్లలో విలువైన బంగారు ఆభరణాలు, డబ్బులు ఉంటే బ్యాంకు లాకర్స్‌లో భద్ర పరుచుకోవాలన్నారు. ఈ వేసవి కాలంలో ఇళ్లలో విలువైన వస్తువులుపెట్టి ఆరుబయట నిద్రిస్తే దొంగతనాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, అందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలోని కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కళాజాతా బృందం సభ్యులు ప్రజలకు పాటల రూపంలో సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. రాజాపూర్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, బాలానగర్ ఎస్‌ఐ జయప్రసాద్, ఎంపీటీసీ శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

మిడ్జిల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను, కేజీబీవీ, బోయిన్‌పల్లి ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. కస్తూర్బా బాలికల పాఠశాల నిర్వహణ తీరుపై, తాగునీటి ట్యాంక్ నల్లాలు లీక్ అవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం వరకు నల్లాలను ఫిట్టింగ్ చేసి ఫొటోలు పంపించాలని ఆదేశించారు. ఫొటోలు పెట్టకుంటే సస్పెండ్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు అందిస్తున్నారా అని విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఫ్యాన్లు పనిచేయడం లేదని విద్యార్థులు తెలియజేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

ముందుస్తు అరెస్టు హేయమైన చర్య



భూత్పూర్ నినాదాలు చేస్తున్న నాయకులు

భూత్పూర్: రాష్ట్రంలో, జిల్లాలో ఏ కార్యక్రమం జరిగినా అధికార పార్టీ వారు పోలీసులను అడ్డం పెట్టుకొని ముందుస్తు అరెస్టు చేయడం హేమమైన చర్యగా టీపీసీసీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సాధిక్ ఆరోపించారు. గురువారం భూత్పూర్ పోలీసులు ముందుస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడం సరైంది కాదని సాధిక్ విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ పేపర లీక్ కేసులో సిట్ విచారణ నిమిత్తం పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి మద్దతుగా హైదరాబాద్ వెళ్తారనే అనుమానంతో తమను తమ పార్టీకి చెందిన వారిని అరెస్టు చేసి స్టేషన్‌లో ఉంచడమేమిటని ప్రశ్నించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌పై ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోకుండా చిన్నపాటి ఉద్యోగులైన వారిపై ముందుగా చర్యలు తీసుకోవడం సరైన నిర్ణయం కాదని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, టీపీసీసీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సాధిక్, సీనియర్ నాయకులు గోవర్ధన్ గౌడ్, హర్యా నాయక్, మన్యంను ముందుస్తు అరెస్టు చేసి స్టేషన్‌లో ఉంచారు. మధ్యాహ్నం సొంత పూచికత్తుపై వారిని విడుదల చేశారు.

కాంగ్రెస్‌కి పూర్వ వైభవం రావడం ఖాయం

కోయిల్‌కొండ: రేవంత్ రెడ్డి సిట్ విచారణ నేపథ్యంలో మండల కాంగ్రెస్ కార్యకర్తలను ముందస్తుగా గురువారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ వై.మహేందర్‌గౌడ్ మాట్లాడారు. అరెస్ట్‌లకు భయపడేది లేదన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం రావడం ఖాయమన్నారు. అరెస్టయిన వారిలో విద్యాసాగర్‌గౌడ్, మనోజ్‌కుమార్, గౌస్, దస్తగిరి, రామస్వామి తదితరులు ఉన్నారు.

నాయకులు అరెస్ట్

మిడ్జిల్: రేవంత్‌రెడ్డి సిట్ విచారణ సందర్భంగా గురువారం మండల కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అల్వాల్‌రెడ్డి, గౌస్, సంపత్, అశోక్, పర్వతాలు, ఉస్మాన్ ఉన్నారు.

జడ్చర్ల: ముందస్తుగా కొందు కాంగ్రెస్ నాయకులను పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని సిట్ విచారణ చేస్తున్న నేపథ్యంలో ముందస్తుగా కాంగ్రెస్ నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

మలుపులు ప్రమాదాలకు పిలుపులు

అడ్డాకుల: పొన్నకల్, కన్మనూర్ గ్రామాలకు వెళ్లే దారిలో మలుపులు ప్రమాదకరంగా మారాయి. జాతీయ రహదారి నుంచి పొన్నకల్‌కి వెళ్లే దారిలో చెరువుకట్ట వద్ద రోడ్డు పెద్ద మలుపు ఉంది. ఇక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. మలుపు వద్ద వేగంగా వెళ్లే వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలు ఉన్నాయి. బలీదుపల్లి నుంచి కన్మనూర్ వెళ్లే దారిలో ఇలాంటి మలుపే ఉంది. అక్కడ కూడా ఎలాంటి హెచ్చరిక బోర్డులు, వేగనిరోధకాలు ఏర్పాటు చేయలేదు. అధికారులు స్పందించి ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, సూచికలు, తగిన ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పొన్నకల్ దారిలో ప్రమాదకర మలుపు ఇలా..



కన్మనూర్ రోడ్డులో ప్రమాదకర మలుపు

పోలేపల్లి రహదారులపై స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటు



జడ్చర్ల: మండల పరిధిలోని పోలేపల్లి సెజ్‌లోని ప్రధాన రహదారులపై ప్రమాద స్థలాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో గురువారం పోలీసులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. రహదారులపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనాలు మితిమీరిన వేగంతో నడుపుతుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పోలీసులు తెలియజేశారు. ఇటీవల పలు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుని కొందరు మృత్యువాత పడగా, మరికొందరు తీవ్ర గాయాలపాలయ్యారన్నారు. ప్రమాదాల నివారణలో భాగంగా వాహనాల వేగ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లు సీఐ రమేశ్‌బాబు తెలియజేశారు.

స్వచ్ఛత మహోత్సవంపై ప్రచారం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పద్మావతినగర్ కాలనీలోని పార్కులో గురువారం స్వచ్ఛత మహోత్సంపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సేంద్రియ ఎరువుల తయారీ, పారిశుద్ధ్యం, వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో మహిళల పాత్రపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కట్టా రవికిషన్‌రెడ్డి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



గండేడ్: మండల పరిధిలోని సల్కర్‌పేట్, పంచాంగల్‌తండా, చిన్నారం తదతర గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్డు పనులను జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీసీరోడ్ల ఏర్పాటుతో రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, పెంట్యానాయక్, గోపాల్, గోపాల్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, లింగం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కళ్యాణి జన్మదినం

బాలానగర్: జెడ్పీటీసీ సభ్యురాలు, జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ కళ్యాణి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆమెను కలిసి పూలమాలలు వేసి, బొకేలు ఇచ్చి శాలువాలు కప్పి సన్మానించారు. మండల అభివృద్ధికి సేవలు అందించాలని ఆకాంక్షించారు. శ్రీనివాస్ రావు, వైస్ ఎంపీపీ వెంకటచారి, తిరుపతి, మణి పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న కప్పెరిబచ్చిరెడ్డి

రాజాపూర్: మండల కేంద్రంలోని అగస్త్య విద్యాలయంలో అరబిందోఫార్మా సౌజన్యంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని అరబిందోఫార్మా సీనియర్ మేనేజర్ గోవర్ధన్‌రావ్‌తో కలిసి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కప్పెరిబచ్చిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బచ్చిరెడ్డి మాట్లాడారు. యువకులు నిరుద్యోగులు, విద్యార్థులు ఈ గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలన్నారు. రూ.లక్షలు వెచ్చించి చక్కటి ఫర్నీచర్‌తో పాటు 3,500 పుస్తకాలు, పోటీ పరీక్షలకు, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు, కథల పుస్తకాలు మొదలైన ఎన్నో పుస్తకాలు గ్రంథాలయంలో సమకూర్చడం మా గ్రామస్తుల అదృష్టమన్నారు. అరబిందోఫార్మ చైర్మన్ నిత్యానంద రెడ్డి, డైరెక్టర్ శరత్‌చంద్రారెడ్డి సీఎస్ఆర్‌ఫండ్ హెడ్ సదానందరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మహిపాల్‌రెడ్డి, నరహరి తదితరులు పాల్గొన్నారు.

చలోఢిల్లీ కరపత్రం విడుదల



కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

హన్వాడ: ఎస్సీ వర్గీకరణ సాధనకు కోసం ఈ నెల 31న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిర్సనగండ్ల బాల్‌రాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన మండల కేంద్రంలో కరపత్రం విడుదల చేశారు. ఈ నెల 30న జిల్లా వ్యాప్తంగా దీక్షా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. లక్ష్మయ్య, వాసు, గంగాపురి, శ్రీనివాసులు, దస్తయ్య, చెన్నయ్య, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పోషణ పక్షం



కార్యక్రమంలో టీచర్లు రాణి, ఈదమ్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండల పరిధిలోని వేముల, మసిగొండ్లపల్లి, వస్పుల అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ పక్షం నిర్వహించారు. పోషణ లోపంతో కలిగే నష్టాలను వివరించారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మొలకెత్తిన విత్తనాలు, ఆకుకూరలు బాగా తీసుకోవాలని సూచించారు. పోషణ ఆరోగ్య తెలంగాణ లక్ష్యమని అంగన్‌వాడీ టీచర్లు వివరించారు.

కుక్కల తరలింపు



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 13, 24వ వార్డులో గురవారం కుక్కల తరలింపు చేపట్టారు. కౌన్సిలర్లు నందకిశోర్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి పర్యవేక్షణలో మున్సిపాలిటీ డాగ్‌టీం సభ్యులు కుక్కలను పట్టి వాహనాల్లో మహబూబ్‌నగర్‌లోని ఎంఎల్‌టీ సెంటర్‌కు తరలించారు. రెండు వార్డుల్లో కుక్కల బెడద అధికంగా ఉండటంతో వాటి తరలింపు చేపట్టారు.

కంటిచూపును కాపాడుకోవాలి



టీచర్స్‌కాలనీలో కొనసాగుతున్న కంటి వెలుగు



గండేడ్‌లో అద్దాలు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

గండేడ్: కంటిచూపును జాగ్రత్తగా కాపాడుకోవాలని జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని వెన్నాచెడ్‌లో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ పుల్లారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కంటి చూపు కోల్పోయే వారి సంఖ్య పెరుగుతుందని, సరైన వైద్యం చేయించుకోలేని పరిస్థితిల్లో నిరుపేదలున్నారని, వారికి తగిన వైద్యసేవలందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. కంటి సంబంధ వ్యాధులున్న వారు శిబిరానికి వెళ్లి సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఏసీఎస్ వైస్‌చైర్మన్ లక్ష్మీనారాయణ, ఆర్‌ఎస్‌ఎస్ చైర్మన్ చిన్నయ్య, రాంచంద్రారెడ్డి, దశరత్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'కంటివెలుగు'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో 'కంటివెలుగు' కొనసాగుతోంది. గురువారం మొత్తం 1,599 మందికి పరీక్షలు నిర్వహించి 181 మందికి కంటి అద్దాలు అందజేశారు. అలాగే 159 మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాలు ఇచ్చారు. ఇక కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 61,381 మందికి పరీక్షలు నిర్వహించి 10,469 మందికి అద్దాలు పంపిణీ చేశారు. అలాగే 6,135మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాలు ఇచ్చారు.